జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

స్పెషల్ ఎడిషన్

Epaper.Edisangathi.com

సంపుటి: 4 - సంచిక: 264 | 18 మే 2026 | సోమవారం | 4 పేజీలు




## ఇందూర్‌కు సీఎం పంగనామాలు

(నిజామాబాద్, ఇదీ సంగతి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతూ ఇందూర్ జిల్లాకు పంగనామాలు పెడుతున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇందూర్‌కు ఔటర్ రింగ్ రోడ్ ఇస్తానని నమ్మబలికి, అధికారంలోకి వచ్చాక ఆ మాటను పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. “టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అనగదొక్కేందుకే సీఎం రేవంత్ రెడ్డి నిజామాబాద్ జిల్లాకు మొండిచేయి చూపిస్తున్నారని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలోనూ సీఎం అబద్ధాలు చెప్తున్నారు. అసలు జిల్లాకు ఏం చేశారని పీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారులు, రూరల్ కాంగ్రెస్ నేతలు ఏ మొఖం పెట్టుకొని ప్రజల్లో తిరుగుతున్నారు? అది చేస్తా.. ఇది చేస్తానని మాయమాటలు చెప్పి, దేవుళ్ల మీద ఒట్లు వేసి సాక్షాత్తూ భగవంతుడినే మోసం చేసిన రేవంత్ రెడ్డికి.. ప్రజలను మోసం చేయడం ఒక లెక్కా? ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ వాటా కూడా ఉందనే కనీస జ్ఞానం లేదా అని ప్రశ్నించారు.”గతంలో నిజామాబాద్ నగరాన్ని అప్‌గ్రేడ్ చేస్తానని మాయమాటలు చెప్పిన కేసీఆర్‌ను ప్రజలు ఎలాగైతే ఫామ్‌హౌస్ (గెస్ట్ హౌస్)లో కూర్చోబెట్టారో.. రేవంత్ రెడ్డికి కూడా అదే గతి పడుతుంది. ఇంకా ఉనికిలోనే లేని ‘ఫ్యూచర్ సిటీ’ గురించి సీఎం చెప్తున్న మాటలను ప్రజలు ఎలా నమ్ముతారు 2034 వరకు నేనే సీఎం అంటూ రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారు. అసలు 2039 దాకా రాహుల్ గాంధీ ప్రధాని కాలేరని రేవంత్ స్వయంగా ఒప్పుకున్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి కల్లబొల్లి మాయ మాటలు మాట్లాడడం మానుకుంటే మంచిది.” కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ఎప్పటికీ పూర్తికావని ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర డ్రైనేజీ పనుల దుస్థితిపై ఆయన గణాంకాలను విడుదల చేశారు: మొత్తం అంచనా వ్యయం సుమారు రూ. 163 కోట్లు, పూర్తయిన పనులు: ఇప్పటివరకు కేవలం 25 శాతం మాత్రమే పనులు పూర్తి అయ్యాయని తెలిపారు.గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇచ్చింది కేవలం రూ. 10 కోట్లు మాత్రమే. “ఇదా ఇందూర్ నగరంపై సీఎం రేవంత్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి నిజామాబాద్ జిల్లా ప్రజలను మోసం చేస్తే ఊరుకునేది లేదు. జిల్లా అభివృద్ధి కోసం నిధుల సాధనకై పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.” అని అరవింద్ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాజయం తప్పదని అరవింద్ జోస్యం చెప్పారు. 2029 ఎన్నికల్లో రాష్ట్రంలో ‘హైటెన్షన్’ రాజకీయాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి, బీజేపీ రాష్ట్ర నాయకులు, కార్పొరేషన్ మాజీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## వరుస చైన్ స్నాచింగ్‌ల.. ముఠా గుట్టు రట్టు!!

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

నిజామాబాద్ జిల్లా కేంద్రాన్ని గత వారం రోజులుగా వణికించిన వరుస చైన్ స్నాచింగ్‌ల కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. పోలీసు కమిషనర్ (సిపి) ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన నిజామాబాద్ సబ్ డివిజన్ పోలీసులు.. ఓ అంతర్రాష్ట్ర పాత నేరసుడిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ రోజు సోమవారం నమ్మదగిన సమాచారంతో నిజామాబాద్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పంబోలి ప్రాంతంలో నిందితుడిని పట్టుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం: జిల్లాలో వరుసగా జరుగుతున్న బంగారు గొలుసుల దొంగతనాలపై పోలీసు కమిషనర్ తీవ్రంగా స్పందించారు. నిందితులను పట్టుకునేందుకు నిజామాబాద్ సబ్ డివిజన్ ఏసీపీ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిఘా పెట్టిన పోలీసులు.. పంబోలి ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహారాష్ట్రకు చెందిన పాత నేరస్థుడు అమన్ హుస్సైన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో నిందితుడు సంచలన విషయాలు వెల్లడించాడు. ఉమ్మడి ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో తాను వరుస నేరాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిజామాబాద్ జిల్లాలో ఇటీవల చేసిన దొంగతనాలకు సంబంధించి.. నిజామాబాద్ ఫోర్ టౌన్, త్రీ టౌన్, మాక్లూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉంటూ పోలీసుల కళ్లు గప్పి తప్పించుకు తిరుగుతున్నట్లు విచారణలో తేలింది. నిజామాబాద్ జిల్లాలో దొంగిలించిన బంగారు ఆభరణాలను మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్ ప్రాంతాల్లో విక్రయించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. పట్టుబడిన నిందితుడిని మహారాష్ట్రలోని నాందేడ్ (మస్తాన్‌పురా, విష్ణునగర్) నివాసి, వృత్తిరీత్యా టైలర్‌గా పనిచేస్తున్న అమన్ హుస్సైన్ ఇక్బాల్ హుస్సైన్ అలియాస్ అమన్ పటేల్ (23)గా పోలీసులు గుర్తించారు. నిందితుడిని ఈరోజు కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో నిందితుడిని జైలుకు తరలించారు. దొంగిలించబడిన బంగారు సొత్తును రికవరీ చేసేందుకు పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు.

## జిల్లా నేలలకు అనుకూలమైన విత్తనాలే ఇవ్వాలి

(నిజామాబాద్, ఇదీ సంగతి)



రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ఎనిమిది రకాలకు బదులుగా.. జిల్లా నేలలు, వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన సన్న వరి విత్తనాల ను మాత్రమే పరిగణనలోకి తీసుకుని, తక్షణమే రైతులకు పంపిణీ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులచారి డిమాండ్ చేశారు. సోమవారం ఇందూరు జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఆయన, పార్టీ నాయకులతో కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వానకాలం సీజన్‌లో వ్యవసాయ శాఖ సూచించిన 8 రకాల సన్న వరి రకాలనే సాగు చేయాలంటూ నిబంధనలు పెట్టడం, విత్తన దుకాణాల్లో కూడా వాటినే విక్రయించాల ని ఆంక్షలు విధించడం వల్ల ఇందూర్ జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు జిల్లా రైతులు పండిం చే ఏ సన్న రకం వడ్లకైనా ప్రభుత్వం ఇచ్చే బోనస్ వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కలెక్టర్‌ను కోరారు. రోహిణి కార్తెను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైన సన్న రకం నాణ్యమైన వరి విత్తనాలను వెంటనే సరఫరా చేయాలని, రైతుల శ్రేయస్సు కోసం తక్షణమే సానుకూల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ‘చీతా ఫోర్స్’ మెరుపు దాడి

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

పేదల నోళ్లు కొట్టి ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ (పీడీఎస్) బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న ముఠాలపై నిజామాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగరంలో అక్రమంగా నిల్వ ఉంచిన, రవాణా అవుతున్న రేషన్ బియ్యంపై సోమవారం ‘చీతా ఫోర్స్’ సిబ్బంది మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 38 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు రవాణాకు ఉపయోగించిన ఒక అశోక్ లేలాండ్ వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా దందా సాగుతుందన్న పక్కా సమాచారంతో జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, తీవ్రంగా స్పందించారు. సీపీ ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ (ఇన్‌చార్జ్) మస్తాన్ అలీ ఆధ్వర్యంలో చీతా ఫోర్స్, స్థానిక పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నగరంలోని మూడు ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఫోర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రిలయన్స్ షాపింగ్ మాల్ ఎదురుగా రోడ్డుపై అనుమానాస్పదంగా వెళ్తున్న అశోక్ లేలాం డ్ వాహనాన్ని (టూ 16 ఖజ 8373) పోలీసులు ఆపి సోదా చేశారు.

## పీఎం రాహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

(నిజామాబాద్, ఇదీ సంగతి)



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన “ పీఎం రాహత్ “ పథకాన్ని ఇందూరు వాసులు సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ఒక ప్రకటన లో తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సత్వరమే చికిత్స అందించడమే పథకం ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చేరిన వారికి ఏడు రోజుల పాటు వర్తిస్తుందన్నారు. నిర్నీత రోజుల్లో రూ.1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్సను అందజేస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ అమలవుతున్న ఆసుపత్రుల్లో త్వరలోనే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కావున జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

స్పెషల్ ఎడిషన్

Epaper.Edisangathi.com

సంపుటి: 4 - సంచిక: 264 । 18 మే 2026 । । సోమవారం । । 4 పేజీలు



## చిరుత పులి దాడిలో మూడు లేగ దూడలు మృతి

(కామారెడ్డి, ఇదీ సంగతి)

తాడ్వాయి మండలం నందివాడ పరిధిలోని సామ దుబ్బ .తండాలో రాత్రి చిరుత పులి దాడిలో మూడు లేగ దూడలు హతమయ్యాయి.తండాకు చెందిన రమావత్ రమేష్ లేగ దూడలను తండా పక్కనే ఉన్న తన పశువుల పాకలో కట్టివేసి ఉంచాడు. ఒక్కసారిగా రాత్రి సమయంలో కట్టివేసి ఉంచిన లేగ దూడలపై చిరుత పులి దాడి చేయడంతో .రెండు లేగ దూడలపై దాడి చేసి అక్కడే హతమార్చగా,మరో లేగ దూడను దూరంగా తీసుకువెళ్లి హతమార్చింది. ఈ దాడిలో రూ.95 వేల వరకు ఆస్థి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.ఈ విషయమై బాధితుడు రమేష్ మాట్లాడుతూ.. తాను నిరుపేదనని కాయ కష్టం చేసి బ్రతుకుతున్నానని జరిగిన నష్టానికి అధికారులు స్పందించి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు , చిరుత దాడి పశువుల మృతి సంఘటన సర్పంచ్ జాదవ్ రేణుక గణపతి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను ఓదార్చారు. ఈ విషయమై సర్పంచ్ మాట్లాడుతూ... అటవీశాఖ అధికారులు స్పందించి తండాలను చిరుత పులి దాడుల నుంచి రక్షించాలని కోరారు. అవసరమైన నిఘా చర్యలు తీసుకుని కాపాడాలన్నారు. తండాలు అటవీ ప్రాంతం పక్కనే ఉండడంతో చిరుత పులి ఎప్పుడు దాడి చేస్తుందోనని తండా వాసులు భయపడుతున్నారని సర్పంచ్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. సోమవారం ఉదయం ఫారెస్ట్ అధికారులు చిరుత దాడి సమాచారం తెలుసుకొని సంఘటన చేరుకొని పరిశీలించి చిరుత దాడిలో లేగా దూడలు చనిపోయిన రైతన్నకు ఆర్థిక సాయం అందేలా పై అధికారులకు రిపోర్ట్స్ చేసామని మృతి చెందిన పశువులు పంచనామ నిర్వహించే, మండల పశు వైద్య అధికారి తెలిపిన పంచనామ రిపోర్ట్స్ ప్రకారం పశువుల ఖరీదు రూపాయలు బాధిత రైతులు బ్యాంకు అకౌంటు లోకి ,ఫారెస్ట్ శాఖ వారం రోజుల్లోపు ,బాధితుడు అకౌంట్లోకి డబ్బులు వస్తాయని ఆయన తెలియజేస్తూ తాడ్వాయి వివిధ గ్రామాల రైతులకు ఫారెస్ట్ అధికారులు తెలియజేస్తూ, గ్రామ శివారు దట్టమైన చెట్లు అడవి ప్రాంతాలలో కాల్వలో వాగులు నీటి కుంటలు సంచరిస్తున్న చిరుత నీరు తాగడానికి వస్తుందని రైతులు జాగ్రత్త వహిస్తూ పశువులను గ్రామంలో పశువులను కట్టు వేసుకోవాలని, వ్యవసాయ పనులకు వెళ్లే ముందు రైతులు మేకల మంద కాపరి తగు జాగ్రత్తలో ఉండాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సిఐ, వినోద్, ఫారెస్ట్ బీట్ అధికారి తెలిపారు.




# స్టాక్ మార్కెట్ క్రాష్..!

(స్టేట్ బ్యూరో, ఇదీ సంగతి)

సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 800 పాయింట్లకు పైగా కుప్పకూలగా.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 250 పాయింట్లకు పైగా నష్టపోయింది. ఇరాన్ సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన సరఫరా దెబ్బతింటుందనే భయాలతో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున విక్రయాలకు మొగ్గు చూపడం, ముఖ్యంగా ఐటీ, బ్యాంకింగ్, ఆటోమొబైల్ రంగానికి చెందిన కీలక షేర్లు ఒత్తిడికి లోనవడంతో కేవలం ఒక్క రోజులో ఇన్వెస్టర్ల లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోయింది.

### రూపాయి విలువ రికార్డు స్థాయి పతనం

మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్లో చమురు దిగుమతుల ఖర్చులు పెరగడం, డాలర్‌కు డిమాండ్ విపరీతంగా పెరగడంతో భారత రూపాయి (ఐఎన్ఆర్) విలువ చరిత్రలో ఎన్నడూ లేనంత ఘోరంగా పతనమైంది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 96.32 కి పడిపోయి సరికొత్త ఆల్‌టైమ్‌లో రికార్డును నమోదు చేసింది.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

(నిజామాబాద్, ఇదీ సంగతి)

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 150 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీఆర్‌ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

### ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

### జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు

కాగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజా పాలన సభలను విజయవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిగేలా పరస్పర సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు.



ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

సంపుటి: 4 - సంచిక: 264 | 18 మే 2026 | సోమవారం | 4 పేజీలు

## అక్రమంగా తరలిస్తున్న 20క్వింటాళ్ల పీడీఎస్ పట్టివేత




(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

నగరంలోని పూలంగ్ చౌరస్తా పరిధిలో ఆదివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న సుమారు 20 క్వింటాళ్ల పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సారంగాపూర్ ప్రాంతానికి చెందిన అబ్బాస్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీనిపై నిఘా ఉంచిన నాలుగో టౌన్ పోలీసులు పూలంగ్ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక అశోక్ లేలాండ్ లగేజీ వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా, అందులో భారీగా బియ్యం మూటలు లభ్యమయ్యాయి. ఎలాంటి అనుమతులు లేకుండా, గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న సుమారు 20 క్వింటాళ్ల బియ్యాన్ని, దానికి ఉపయోగించిన అశోక్ లేలాండ్ వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఈ మేరకు నిందితుడు అబ్బాస్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు నాలుగో టౌన్ పోలీసులు తెలిపారు.




## నిజామాబాద్..
# నుమాయిష్‌లో విషాదం

• నగర ఎగ్జిబిషన్‌లో క్రేజీ వీల్' ట్రాలీ విరిగిపడి ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు!

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

నగరంలో సరదాగా గడుపుదామని ఎగ్జిబిషన్‌కు వచ్చిన సందర్శకులకు ఘోర ప్రమాదం ఎదురైంది. కంఠేశ్వర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఆదివారం రాత్రి ఒక్కసారిగా కలకలం రేగింది. రన్నింగ్‌లో ఉన్న 'క్రేజీ వీల్' రైడ్‌కు సంబంధించిన ఒక ట్రాలీ ప్రమాదవశాత్తు విరిగిపడటంతో ఇద్దరు యువకులు దాదాపు ఇరవై అడుగుల ఎత్తు నుంచి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా, ఒక యువకుడు విరిగిపడిన ట్రాలీ ఇనుప ఊచల మధ్య ఇరుక్కుపోయి, బయటకు రాలేక తీవ్ర రక్తస్రావంతో నరకయాతన అనుభవించాడు. క్షతగాత్రులను గమనించిన తోటి సందర్శకులు, నిర్వాహకులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. గత వారమే డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లికి చెందిన ఒక మహిళ ఇక్కడి జెయింట్ వీల్ ఎక్కి భయంతో గుండెపోటుకు గురై మృతి చెందిన ఘటన మరవకముందే.. తాజాగా మరో ఘోర ప్రమాదం జరగడం నగరవాసులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. వరుస సంఘటనలు జరుగుతున్నా ఎగ్జిబిషన్ నిర్వహణలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నుమాయిష్ పేరిట ఏటా ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తూ టికెట్లు, స్టాళ్ల రూపంలో నిర్వాహకులు లక్షల రూపాయల ఆదాయాన్ని గడిస్తున్నారు. అయితే, అందుకు తగ్గట్టుగా సందర్శకులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఏర్పాటు చేయకపోవడం తో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా ఎగ్జిబిషన్ వద్ద ఒక అంబులెన్స్‌ను కానీ, డాక్టర్‌ను కానీ అందుబాటులో ఉంచకపోవడం నిర్వాహకుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. కేవలం డబ్బులు సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకుని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు" అని సందర్శకులు మండిపడుతున్నారు.ఇలాంటి ప్రమాదకరమైన రైడ్ల ఫిట్‌నెస్‌ను అధికారులు సరిగా పరిశీలించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఎగ్జిబిషన్‌లో భద్రతా వసతులపై కఠిన నిబంధనలు అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

---

## పది మంది జూదరుల అరెస్టు..

- రూ. 31,110 నగదు, 11 సెల్ ఫోన్లు స్వాధీనం

(నిజామాబాద్ క్రైం, ఇదీ సంగతి)

నగరంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఈ ఆకస్మిక తనిఖీల్లో పది మంది జూదరులను పోలీసులు రంగులరాట్నంగా పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు ఆదివారం అర్ధరాత్రి వేళ పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేశారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన జూదరులను సిబ్బంది చాకచక్యంగా చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 31,110 ల నగదుతో పాటు, జూదానికి ఉపయోగిస్తున్న 11 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన పది మందిపై ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



జనం కోసం..
అక్షర సమరం

# ఇదీ సంగతి

18 మే 2026 | సోమవారం | హైదరాబాద్ | 4 పేజీలు




# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ. 30 లక్షల విలువైన 206 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 2,14,600 నగదు రికవరీ

(సయ్యద్ మొబిన్, ఇదీ సంగతి)

హైదరాబాద్‌లోని గోల్కొండ జోన్ డీసీపీ జి. చంద్రమోహన్ ఐపీఎస్ మార్గదర్శకత్వంలో, గోషామహల్ డివిజన్ ఏసీపీ కె. చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో బేగం బజార్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి. భరత్ కుమార్, డిటెక్టివ్ ఎస్ఐ కె. జగదీశ్వర్ రావు , క్రైమ్ బృందం అత్యంత చాకచక్యంగా వ్యవహరించి, ఒక ప్రమాదకరమైన అలవాటుగా మారిన ఇండ్ల దొంగతనాలు చేసే నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ. 30లక్షల విలువైన 206గ్రాముల బంగారు ఆభరణాలను, రూ. 2,14,600 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వివరాలు.. అమర్ సోన్‌కాంబ్లే ఫుట్‌పాత్ పక్కన, ఎన్.ఎమ్ గూడ, కిషన్ బాగ్, హైదరాబాద్..,స్వస్థలం: ఉద్గీర్ గ్రామం, లాతూర్ జిల్లా, మహారాష్ట్రగా గుర్తించారు. నిందితుడు అమర్ సోన్‌కాంబ్లే తల్లిదండ్రులు మహారాష్ట్రకు చెందినవారైనప్పటికీ, అతను హైదరాబాద్‌లోని కిషన్ బాగ్‌లోనే పుట్టి పెరిగాడు. చిన్న వయస్సులోనే మద్యం, సిగరెట్లు , పబ్బులకు తిరగడం వంటి విలాసవంతమైన అలవాట్లకు బానిసయ్యాడు. ఫంక్షన్ హాళ్లలో వెయిటర్‌గా వచ్చే సంపాదన తన జులాయి ఖర్చులకు సరిపోకపోవడంతో, సులభంగా డబ్బు సంపాదించడానికి దొంగతనాల మార్గాన్ని ఎంచుకున్నాడు. ఇప్పటివరకు ఇతనిపై హైదరాబాద్ నగరంలో (3) ఇండ్ల దొంగతనాలు , ఒక (1) పోక్సో కేసు నమోదై ఉన్నాయి. ఈ నెల 6వ తేదీన గోషామహల్, హిందీ నగర్ పరిధిలోని ఒక ఇంట్లో రాత్రి వేళ తాళాలు పగలగొట్టి దొంగతనం జరిగినట్లు బేగం బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. బాధితుడు ఎమ్. కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... బేగం బజార్, గోషామహల్, హిందీ నగర్‌లోని తన నివాసం నుండి సుమారు 235 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు రూ. 10లక్షలు (పది లక్షల రూపాయల) నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుపై బేగం బజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా బేగం బజార్ క్రైమ్ బృందం ఘటనా స్థలంలోని మరియు పరిసర ప్రాంతాలలోని సీసీటీవీ (జజుఎ) ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించింది. లభించిన ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించి, 17.05.2026 తేదీన నిందితుడు అమర్ సోన్‌కాంబ్లేను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించగా, అతని వద్ద నుండి దొంగిలించబడిన సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తక్కువ వ్యవధిలోనే కేసును ఛేధించి, నిందితుడిని పట్టుకోవడంలో మరియు దొంగిలించబడిన సొత్తును రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించిన బేగం బజార్ పోలీస్ సిబ్బందిని గోల్కొండ జోన్ డీసీపీ జి. చంద్రమోహన్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

## బక్రీద్ రోజున పరీక్షలు నిర్వహించడం అన్యాయం : బీఆర్ఎస్వీ

(హైదరాబాద్, ఇదీ సంగతి)



ముస్లింల పవిత్ర పండుగ అయిన ఈద్-ఉల్-అజ్హా (బక్రీద్) రోజున ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మే 28న జరగనున్న పలు డిగ్రీ పరీక్షలను వెంటనే వాయిదా వేయాలని బీఆర్ ఎస్వీ జీహెచ్ఎంసీ కోఆర్డినేటర్, యువ ప్రతిపక్ష నాయకుడు అడ్వకేట్ మీర్ ఖుర్రం అలీ డిమాండ్ చేశారు. మీడియాతో మాట్లాడిన ఆయన, పండుగ రోజున పరీక్షలు నిర్వహించడం వేలాది మంది విద్యార్థుల మతపరమైన భావాలను, మానసిక ప్రశాంతతను పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్టేనని మండిపడ్డారు. "విద్యార్థులు ఒకవైపు పండుగ ప్రార్థనలు, కుటుంబ కార్యక్రమాలు నిర్వహించాలా? లేక పరీక్షలు రాయాలా? ప్రభుత్వం మరియు యూనివర్సిటీ అధికారులు ఈ నిర్ణయాన్ని వెంటనే పునఃసమీక్షించాలి," అని అన్నారు.

***మే 28న నిర్వహించేందుకు షెడ్యూల్ చేసిన పరీక్షలు ఇవి:***

బీకాం 4వ సెమిస్టర్ - బిజినెస్ స్టాటిస్టిక్స్
బీకాం 6వ సెమిస్టర్ - అకౌంటింగ్ స్టాండర్డ్స్ డ కార్పొరేట్ గవర్నెన్స్
బీఎస్సీ ఆనర్స్ 4వ సెమిస్టర్ -- కంప్యూటర్ సైన్స్ (బిగ్ డేటా)
బీఎస్సీ ఆనర్స్ 6వ సెమిస్టర్ -- ఆప్టిమైజేషన్ టెక్నిక్స్
బీఎస్సీ బయోమెడికల్ సైన్స్ 4వ సెమిస్టర్
బీఏ (జదీజా) 6వ సెమిస్టర్ -- మ్యాథమెటిక్స్
బీఎస్డబ్ల్యూ (జదీజా) 4వ సెమిస్టర్ -- సోషల్ వర్క్ మెథడాలజీ III

అడ్వకేట్ మీర్ ఖుర్రం అలీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ చీఫ్ సెక్రటరీ వెంటనే జోక్యం చేసుకుని విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. "ఇది కేవలం ఒక మతానికి సంబంధించిన విషయం కాదు. ఇది విద్యార్థుల న్యాయం, సమాన గౌరవం, మరియు బాధ్యతాయుతమైన పాలనకు సంబంధించిన విషయం," అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు చేపడతామని కూడా హెచ్చరించారు. ఇప్పటికే పలువురు విద్యార్థి సంఘాలు మరియు యువజన సంస్థలు బీఆర్ఎస్వీ డిమాండ్‌కు మద్దతు ప్రకటిస్తూ, బక్రీద్ రోజున పరీక్షలు నిర్వహించడం అన్యాయమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

సోమవారం
18 మే 2026

ఇదీ సంగతి

జనం కోసం..
అక్షర సమరం

# ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమించాలి

## - బీజేపీ జిల్లా కోర్ కమిటీ సమావేశంలో ఎంపీ అర్వింద్ దిశానిర్దేశం

(నిజామాబాద్ ఇదీసంగతి)

ప్రజల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ, నిరంతరం ఉద్యమించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా కోర్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీ అర్వింద్‌తో పాటు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. అయితే, జిల్లాలో పార్టీ కార్యకలాపాలు ఆశించిన స్థాయిలో సాగడం లేదని, కొన్ని నియోజకవర్గాల్లో స్తబ్దత నెలకొనడంపై ఎంపీ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ప్రతి నెలా స్థానిక సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీ అర్వింద్ స్పష్టం చేశారు. “ఎమ్మెల్యేలు ఉన్నా, లేకున్నా స్థానిక నియోజకవర్గ నాయకులే బాధ్యత తీసుకుని



ముందుకు సాగాలి. ఫలానా వారే కార్యక్రమాలు చేయాలనే నిబంధన ఏమీ లేదు. ఎవరు ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడి, నిరంతరం ప్రజల్లో ఉంటారో వారికే ప్రజాదరణ పెరుగుతుంది. రాబోయే ఎన్నికల్లో వారే అభ్యర్థులుగా ఎదిగే అవకాశం ఉంటుంది” అని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఇటీవల జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయ స్థల వివాదంపై అక్కడి నాయకులు గట్టిగా పోరాడారని, అలాగే కోరుట్ల నియోజకవర్గంలోనూ ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై పార్టీ శ్రేణులు చురుగ్గా కదిలాయని ఎంపీ గుర్తు చేసినట్లు తెలిసింది. ఆయా నియోజకవర్గాల పోరాట పటిమను మిగిలిన నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ అర్బన్, కొంతవరకు రూరల్ నియోజకవర్గాల్లో పార్టీ హడావుడి కనిపించిందని, కానీ మిగతా నియోజకవర్గాల్లో ప్రభుత్వ వైఫల్యాలపై ఆశించిన స్థాయిలో నిరసనలు జరగడం లేదని అభిప్రాయపడ్డారు. ఇకపై జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాలని కోర్ కమిటీ నేతలకు ఎంపీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, కోర్ కమిటీ సభ్యులు పాల్గొని జిల్లాలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన పలు అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ

# సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం

(నిజామాబాద్ ఇదీసంగతి)

ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ప్రతి ఒక్కరూ సేవ కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చిన సుద్దపల్లి ఉప సర్పంచ్ క్రాంతి కుమార్ అన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నేడు సుద్దపల్లి గ్రామంలోనీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నందు నిత్యావసర సరుకుల ఛాలెంజ్ -2026 కార్యక్రమాన్ని ఏర్పాటు చెయ్యడం జరిగింది నిరంతరం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమలకి సంబంధించి ఈ నిత్యవసర వస్తువుల ఛాలెంజ్ ను స్వీకరించి ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి నిత్యవసర సరుకులు అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా సుద్దపల్లి గ్రామ ఉపసర్పంచ్ క్రాంతి కుమార్ హాజరయ్యారు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ చేస్తున్న సేవ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి నిస్తునాయని కొనియాడారు అనాథలకు సేవ చెయ్యడమంటే భగవంతుని సేవ చేయడమేనని అన్నారు. ఇందూరు యువత సేవలు ప్రతి ఒక్కరినీ కదిలిస్తాయాన్ని తెలిపారు. అనంతరం డిచ్పల్లి పోలీస్ స్టేషన్ ఏ.ఎస్. ఐ ముజిముద్దీన్
మాట్లాడుతూ మానవత్వాని ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ నిలువెతు నిదర్శనమని అన్నారు. మరియు



బీ.జే.వై.యం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీష్ మాట్లాడుతూ ఆకలితో అలమటిశేచే అనాథలకు ప్రతినిత్యం అన్నదానం చెయ్యడం గొప్ప విషయమని అన్నారు ఇలాంటి సేవ కార్యక్రమాల్ని మా గ్రామం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఎలాంటి సేవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.మద్దకూరి సాయిబాబు, మరియు వి.డి.సి చైర్మన్ జనార్ధన్ , వైస్ ఛైర్మన్ కాతదర్ గంగాధర్ , దేవ్పల్లి సర్పంచ్ సురేష్ , ఇందూరు యువతకార్యవర్గం మద్ది గంగాధర్ ,కొండా నాగేందర్,దర్శనం రాజు, అఫ్రోజ్ గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై ‘చీత ఫోర్స్’ మెరుపు దాడి.

(నిజామాబాద్ ఇదీసంగతి)



జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ‘చీత ఫోర్స్’ బృందాలు ఉక్కుపాదం మోపాయి. ఆదివారం జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రత్యేక ఆదేశాల మేరకు వెల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో భారీగా ఇసుకను తరలిస్తున్న ఓ లారీ పట్టుబడింది. జిల్లాలో సహజ వనరుల దోపిడీని అరికట్టడంతో పాటు, అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా సీపీ సాయి చైతన్య ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆదివారం సి.సి.ఎస్ ఏసీపీ ఇంచార్జ్ మస్తాన్ అలీ నేతృత్వంలోని చీత ఫోర్స్ సిబ్బంది వెల్పూర్ పరిధిలో మెరుపు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా, అనధికారికంగా ఇసుకను తరలిస్తున్న 14 టైర్ల భారీ లారీని పోలీసులు గుర్తించి, చాకచక్యంగా పట్టుకున్నారు.లారీని స్వాధీనం చేసుకున్న పోలీసులు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ప్రాథమిక విచారణ జరిపారు. అనంతరం తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం వాహనాన్ని వెల్పూర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

<u>కఠిన చర్యలు తప్పవు: పోలీస్ కమిషనర్ హెచ్చరిక</u>

అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని జిల్లా పోలీస్ అధికారులు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, సహజ వనరుల సంరక్షణకు చీత ఫోర్స్ ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు. అక్రమార్కులపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని సీపీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

# సనాతన ధర్మాన్ని కాపాడటంలో బ్రాహ్మణులు ముందుంటారు







(నిజామాబాద్ ఇదీసంగతి)

సనాతన ధర్మాన్ని కాపాడటంలో బ్రాహ్మణులు ఎల్లప్పుడూ ముందుంటారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. గో సేవా సమితి ఆధ్వర్యంలో అధిక జ్యేష్ఠ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం 108 మంది బ్రాహ్మణ దంపతులకు వాయనం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మూడు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధిక జ్యేష్ఠ మాసంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా పుణ్యం లభిస్తుందన్నారు. సమితి సభ్యులు గో సేవ చేయడమే కాకుండా.. హిందూ ధర్మాన్ని కాపాడే అనేక కార్యక్రమాల్లో ముందు ఉండడం అభినందనీయం అన్నారు. అలాగే వైశ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో గో సేవాసమితి అధ్యక్షుడు వీరమల్లు రమేష్, లక్ష్మీకాంతం గుప్తా, యాదగిరి గుప్తా, యంసాని రవీందర్ గుప్తా, బ్రాహ్మణులపల్లి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.